పత్రికాప్రకటన కాకినాడ, 21.6.2019

ఉత్పత్తులకు ఆప్కో కొనుగోళ్లు, చెల్లింపులు లేక జిల్లాలో చేనేత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ డి.మురళీధరరెడ్డి తెలియజేశారు.

సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, ఆప్కో, చేనేతజౌళి శాఖ, డిసిసిబి, హౌసింగ్ అధికారులతో పత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించారు. సమావేశంలో జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య ప్రతినిధి విరూపాక్షం మాట్లాడుతూ ఆప్కో సంస్థ జిల్లాలో చేనేత సంఘాల నుండి కొనుగోలు చేసిన ఉత్పత్తులకు గడచిన 14 నెలలుగా ఎటువంటి చెల్లింపులు జరపలేదని, సూమారు 12 కోట్ల రూపాయలు బకాయిలు అందక చేనేత కుటుంబాలు తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయని జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. అలాగే చెల్లింపులు జరపలేమనే కారణంతో గత జనవరి నుండి చేనేత సంఘాల ఉత్పత్తులను సేకరించడం కూడా నిలిపి వేయడం వల్ల ఉపాధి కోల్పోయి వీపర్స్ కూలీలుగా మారే పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆప్కో ప్రతినిధుల వివరణ కోరగా, సంక్షేమ శాఖలు హాస్టల్ విద్యార్థుల కొరకు కొనుగోలు చేసిన దుప్పట్లు, ఇతర వస్త్రాలకు రాష్ట్ర వ్యాప్తంగా 90 కోట్ల నిధులు తమ సంస్థకు చెల్లించాల్సి ఉందని, ఈ నిధులు సంస్థకు జమ కాకపోవడం వల్ల చేనేత సంఘాలకు చెల్లింపులు జాప్యమైందని తెలిపారు. ఈ సమస్యను వచ్చే సోమవారం రాష్ట్ర స్థాయిలో జరిగే జిల్లా కలెక్టర్ల సమావేశం సందర్భంగా ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే చేనేత సంఘాలకు త్రిఫ్ట్ ఫండ్, యార్న్ సబ్సిడీ క్రింద చెల్లించ వలసిన మొత్తాలకు సంబంధించిన బిల్లులు ట్రజరీలో పాస్ కాకపోవడం అంశాన్ని, గతంలో చేనేత కార్మికులు గృహనిర్మాణం కొరకు తనఖా పెట్టిన ఇంటి డాక్యుమెంట్లను లబ్దిదారులకు తిరిగి ఇవ్వడంలో నెలకొన్న ప్రతిష్టంబన అంశాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తెలియజేస్తామన్నారు. వడ్డీ రాయితీ పధకం క్రింద చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రాయితీ సొమ్మును సత్వరం వాటికి చెల్లించాలని బ్యాంకు అధికారులను కోరారు. అద్దె చెల్లింపుకు నిధుల కొరత ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని రాజమండ్రిలోని చేనేత బజార్ భవనంలోకి మార్చేందుకు ఆశాఖ ఏడి చేసిన ప్రతిపాదనను చేనేత సంఘాలు, జిల్లా కలెక్టర్ నిర్ద్వందంగా తిరస్కరించారు.

ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఎడి ఎ.ఆనందకుమార్, హౌసింగ్ పిడి పి.వీరేశ్వరప్రసాద్, ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి ఎల్.కృష్ణమూర్తి, బ్యాంకుల అధికారులు, చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)